### పశువుల కాపరిపై జిల్లా కలెక్టర్ దురుసు ప్రవర్తన

# గేదెలు అడ్డువస్తే నిరుపేదకు జరిమానా

## సెల్ ఫోన్ తీసుకుని కలెక్టర్ బెదిరించారన్న బాధితుడు

### కలెక్టర్ తీరుపై జిల్లా ప్రజల విమర్శలు

**మంగపేట జనవరి4, ప్రభాతవార్త :** మంగపేట మండలంలో వింత సంఘటన చోటు చేసుకుంది. రోడ్డుకు గేదెలు అడ్డు వచ్చాయని జిల్లా కలెక్టర్ కృష్ణ ఆధిత్య పశువుల కాపరిపై తన ప్రతాపాన్ని చూపారు. భోరునర్సాపురం నుండి ములుగు జిల్లా కేంద్రం వైపుకు జిల్లా కలెక్టర్ వెళ్ళుతున్న క్రమంలో అదే రోడ్డు మీదుగా గేదెలు వెళ్ళుతున్న క్రమంలో కలెక్టర్ వాహనానికి ఆటంకం కలిగిందని కలెక్టర్ వస్తుంటే గేదెలను రోడ్డు మీదుగా తోలు కెళ్ళుతా, ఇటురా అని కలెక్టర్ గల్లా పట్టు కోవడానికి ప్రయత్నించగా పశువుల కాపరి బయపడి దూరంగా వెళ్ళడంతో ఇటురా అని కోపంగా అరవడంతో బయపడిన బోయిన యాకయ్య(పశువుల కాపరి) ఆయన వద్దకు రావడంతో నీకు ఫోన్ ఉందా అని అడగ్గా లేదని చెప్పడంతో బయటకు తీయి లేకుంటే బొక్కలు ఇరుగుతాయని బెదిరించడంతో ఆయన సెల్ ఫోన్ తీసుకుని స్థానిక పంచాయితీ అధికారులను పిలిపించి ఇతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించడంతో వెంటనే స్పందించిన పంచాయితీ అధికారులు పశువుల కాపరి యాకయ్యకు నోటీసు అందించారు. రూపాయలు 75వందలు జరిమానా విధించారు. తనకు ఉన్న చిన్నపాటి ఇంటికి నెంబర్‌ను రద్దు చేశారు. నీటి సరఫరాను బంద్ చేశారు. సారూ నన్ను క్షమించండి ఆసారు కలెక్టరు అని తెలియదు ఆయన వస్తున్నారని తెలిస్తే నేను గేదెలను రోడ్డు ప్రక్క నుండి రానీయక పోదును ఆయన వెళ్ళే వరకు అడవిలోనే ఉండే వాడినని బాదితుడు అధికారులను వుడుకున్నాడు. తనది రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి అని మాది నిరుపేద కుటుంబమని తెలిపినా అధికారు ఆయన మాటను లెక్క చేయ లేదు. తనకు నెలకు కనీసం 3నుండి4వేల వరకు వస్తాయని 7500 రూపాయలు కట్టాలంటే 2నెలలు కడుపు కట్టుకుని మాకుటుంబం అంతా పస్తులుండాలని ఆయన వుడుకునాన ఉపయోగం లేక పోయింది. జిల్లా కలెక్టర్ చర్యకు జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పిచుకపైన బ్రహ్మాస్త్రం అంటే ఇదేనని జిల్లా పరిపాలన అధికారి ఈవిధంగా ప్రవర్తించడంతో అక్క ఉన్న వారు నివ్వెర పోయారు.

## తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేస్తే శ్రీవారి కానుక వసూలు చేయాలి

### - తిరుపతిలోనూ అడ్డుకుంటాం

### బిజెపి రాష్ట్రఅధికారప్రతినిధి భాను



**తిరుమల,జనవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** పరమ పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రంలో దేవదేవుడు దర్శనార్థం, ఆశీస్సులందుకోవడానికి వస్తున్న ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు రాజకీయ వ్యాఖ్యలు చేస్తే, వారి నుంచి శ్రీవారి కానుక వసూలు చేయాలని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొండపై ఎవరైనా, ఏ పార్టీకి సంబంధించిన నాయకులు అయినా రాజకీయ వ్యాఖ్యలు చేయకూడదని నిబంధనలు ఉన్నాయని, అతిక్రమించి వ్యాఖ్యలు చేస్తే వారిని తిరుపతిలో అడ్డుకుంటామని అన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన నాయకులు స్వామివారి భక్తులుగానే ఉండాలని, ఎటువంటి రాజకీయాలు మాట్లాడకూడదని అన్నారు. ఆలయం పరిసరాల్లో రాజకీయ వ్యాఖ్యలు చేచకూడదని గతంలో టిటిడి చట్టం చేసినా అమలుచేయడంలో విఫలమైందన్నారు. ప్రశాంతత, పవిత్రతను కాపాడటంలో ప్రతి భక్తునికి, నాయకులకు ఉందన్నారు. వైకుంఠద్వారంలో బుధవారం ఉదయం వెంకన్నను భానుప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు.

## రాష్ట్రం నీ జాగీరా జగన్‌రెడ్డి?

### -నారా లోకేష్ ధ్వజం



**అమరావతి,జనవరి 4, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి రాష్ట్రం నీ జాగీరా జగన్‌రెడ్డి అంటూ.. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేష్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వైకాపా పోలీసులు బ్రిటీషు చట్టానికి బూజు దులిపి అర్ధరాత్రి జీఓ విడుదలచేస్తారని, తెల్లారేసరికి ఉల్లంఘిస్తున్నారని చట్టం మీ ఎదుగూరి సందింటికి ఎదురింటి చుట్టమా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు తన నియోజకవర్గంలో పర్యటించేందుకు జగన్‌రెడ్డి ఆక్షలేందని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వం కుతంత్రాలన్నింటినీ కుప్పంలో ప్రయోగిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రచారరథం స్వాధీనం చేసుకున్నారని, తెదేపా కార్యకర్తలను కొట్టిస్తున్నారని విమర్శించారు.. అంతేకాకుండా తెదేపా నేతలను కూడ నిర్భంధించటం హేయమని అన్నారు. తమపై ఎన్నిఅరాచకాలకు పాల్పడినప్పటికీ ప్రభుత్వంపై ఇపుడున్న ప్రజావ్యతిరేకత తగ్గదని అన్నారు. తమ పార్టీ అధినేతకు జనాదరణ ఇంకా పెరుగుతూనే ఉంటుందన్నారు. 35ఏళ్లగా కుప్పం జగన్‌రెడ్డి లాంటి కుట్రదారులను ఎంతోమందిని చూసిందన్నారు. తెలుగుదేశం కోట కుప్పంలో మీ కుప్పిగంతులు చెల్లవన్నారు. పసుపు సైన్యం కదం తొక్కుతోందని, జగన్‌రెడ్డి తల్లకిందులుగా తపస్సు చేసినా తమ పార్టీ అధినేత చంద్రబాబు కుప్పం పర్యటన ఆపలేవని పేర్కొన్నారు.

## రాష్ట్రంలోని సిఐడి కేసుల విచారణ కోర్టుల్లో పిపిల నియామకం

### -13మంది స్పెషల్ పిపిలు

**గుంటూరు లీగల్, జనవరి 4, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా సిఐడి కేసుల విచారణ కోర్టుల్లో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హరిష్‌కుమార్ గుప్త ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని జిల్లాసెషన్స్ కోర్టులు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుల్లో రాష్ట్ర సిఐడి విభాగానికి సహకరించేందుకు గాను మొత్తం 13మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించారు. నేరపరిశోధన, విచారణ, కేసుల ఫైలింగ్ తదితర అంశాలపై సిఐడి పోలీసుల తరుపున ఇకపై మూడేళ్ళపాటు ఈ పిపిలు సిఐడి విచారణ కోర్టులకు హాజరుకానున్నారు. ప్రత్యేక పిపిలు గా నియమితులైన వారిలో గొట్టం శివప్రసాదరెడ్డి(గుంటూరు), బెల్లపు సత్యనారాయణ(విజయవాడ), అడపాకుల శేషుబాబు (విశాఖపట్టణం), నందూరి వెంకట సత్య లింగేశ్వర్(విజయనగరం), పిల్లి శ్రీనివాస్(కాకినాడ), మంద్ర రాజేంద్ర(ఏలూరు), కె.మెహర్ ప్రసాద్(మచిలీపట్నం), కొల్లా నాగేశ్వరరావు(ఒంగోలు), యనన్నం కనకదారి చెన్నయ్య(నెల్లూరు), పానాటి విజయకృష్ణారెడ్డి (చిత్తూరు) ,పి.రాజశేఖర్(అనంతపురం), వి.నాగలక్ష్మీ(కర్నూలు), జి.వెంకటేశ్వరరెడ్డి(కడప) ఉన్నారు. సిఐడి కేసుల్లో ఆర్థిక సంస్థల డిపాజిటర్ల రక్షణ చట్టం, అవినీతి నిరోధక చట్ట పరిధిలోని కేసులపై కూడా ఈ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించాల్సి ఉంటుంది. గతంలో కొన్ని కోర్టుల్లో సిఐడి పిపిలుగా కొనసాగుతున్న కొందరికి ఉద్వాసన పలికిన ప్రభుత్వం సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ నిర్వహించేందుకు గాను కొత్త నియామకాలు చేపట్టినట్లు తెలియవచ్చింది.

## విఘ్నేష్ ఫెర్టిలిటీ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్లో అరుదైన ఐవిఎఫ్ చికిత్సలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐవిఎఫ్ చికిత్స పొందిన మహిళలు

**విజయవాడ, జనవరి 4, ప్రభాతవార్త :** విజయవాడ నగరంలో గత 15 సంవత్సరాలుగా మాతృమూర్తులకు ఎన్నో రకాల సేవలనందిస్తూ వారి ఆదరాభిమానాలను చూరగొన్న విఘ్నేష్ ఫెర్టిలిటీ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్లో అరుదైన ఐవిఎఫ్ పద్ధతి ద్వారా ఇద్దరు మహిళలు బిడ్డలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి ఫెర్టిలిటి వైద్య నిపుణులు డా॥ కొడాలి వల్లి మాట్లాడుతూ గణపవరం'కు చెందిన ఎం.సంధ్యారాణి, కబేళా సెంటర్‌కు చెందిన ఎం.సరిత"లకు 10 సంవత్సరాల క్రితం పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ జరిగిన తరువాత దురదృష్టవశాత్తు పిల్లలు మరణించడం వల్ల వీరికి ఐవిఎఫ్ ప్రక్రియ ద్వారా పిల్లలు జన్మించారని, ఇదొక గొప్ప వరంగా భావిస్తున్నామన్నారు. 10 సంవత్సరాల తర్వాత మాతృమూర్తులై పిల్లలు ఆరోగ్యంగా ఉన్నందున, వైద్యుల శ్రద్ధకు ఇరువురు మహిళలు హాస్పిటల్‌కు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



## గిరిజన గురుకుల జె.సిని విధుల నుండి తొలగించాలి!

### -టిఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్ డిమాండ్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 4 ప్రభాతవార్త:** మూడవ ఏకలవ్య ఆదర్శ గురుకులం పాఠశాలల జాతీయ క్రీడల నిర్వహణలో నిధులను దుర్వినియోగం చేసిన గురుకులం జాయింట్ సెక్రటరీ(జె.సి)ని తక్షణం విధుల నుండి తొలగించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టిఎస్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు స్థానిక ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం ముందు టిఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అక్కులప్ప మాట్లాడుతూ గత నెల డిసెంబర్‌లో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల మూడవ జాతీయ క్రీడల నిర్వహణ కోసం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, శిక్షణ పేరిట ప్రభుత్వం కోట్లాది రూ॥లను కేటాయించిందన్నారు. అయితే గురుకులం జాయింట్ సెక్రటరీ ఒక్కరోజు కూడా పౌష్టికాహారం అందించకుండా, శిక్షణ, క్రీడల నిర్వహణ పేరిట భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన గిరిజన క్రీడాకారులకు నాసిరకం ఆహారం పెట్టి, ఎటువంటి మెనూ పాటించకుండా నిధులను ఖర్చు చేసినట్లు దొంగ లెక్కలు చూపించారని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా గిరి పుత్రులు జాతీయ క్రీడల్లో పాల్గొనడానికి వస్తే వారికి సరైన సౌకర్యాలు కల్పించకుండా కేంద్రం విడుదల చేసిన వేల కోట్ల రూ॥లను దారి మళ్లించి, అధికారులకు, ప్రభుత్వానికి లెక్కలు చెప్పకుండా మోసం చేసిన అతనిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



బివి సాగర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్స్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్.

## జగ్గయ్యపేట ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్స్

**జగ్గయ్యపేట, జనవరి 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్‌టిసి డిపో క్రీడా మైదానంలో ఈనెల 6వ తేదీ నుండి ప్రారంభం కానున్న బివి సాగర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్స్ పోస్టర్లను మాజీమంత్రి, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బుధవారం ఆవిష్కరించారు. ఈ టోర్నమెంట్స్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు వంతున నగదు బహుమతి ప్రధానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

## జాతీయ గుర్తింపునకు పిహెచ్‌సిని తనిఖీ చేసిన కేంద్ర వైద్యనిపుణుల బృందం

**రాజవొమ్మంగి, జనవరి 4, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం జాతీయ ఆరోగ్య భద్రతా ప్రమాణాల పరిశీలన బృందం తనిఖీలు చేసారు. జాతీయస్థాయిలో గుర్తింపు ఇవ్వడానికి అన్ని వైద్యసేవలుపై త్రిపుర నుండి వచ్చిన వైద్యనిపుణులు డా.అలక్‌దాస్, పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన డా. రంజిత్‌కుమార్‌లు సంయుక్తంగా పిహెచ్‌సిలో ఓపి సేవలు, ల్యాబ్, జనరల్ వార్డు, టాయిలెట్లు, బెర్త్‌వెయింటింగ్ హాలు, ఫీడర్‌అంబులెన్స్‌తో బాటు ప్రతీ దానికి క్షుణ్ణంగా చూసారు. బెర్త్‌వెయింటింగ్ హాలులో వైద్యసేవలు పొందుతున్న గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలు, బోజనాలు, మందులు అడిగి తెలుసుకున్నారు. ప్రసవాంతరం తల్లి బిడ్డను ఇంటికి తల్లిబిడ్డ వాహనంలో తరలిస్తున్నారా అని అడగటం జరిగింది. ఆసుపత్రి శుభ్రతను చూసారు. రెండు రోజులు పాటు ఈతనిఖీలను పిహెచ్‌సిలో మాత్రమే చేస్తారని అల్లూరి జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ డా.రాకేష్ అన్నారు. వారు పరిశీలించిన అంశాలను డిల్లీలో గల ఎన్.హెచ్.ఎస్.ఆర్.సికి నివేదికను ఇస్తారన్నారు. దానికి బట్టి పిహెచ్‌సికి ఎన్ క్వాస్ సర్టిఫికెట్ వస్తే ప్రతీ ఏడాది పిహెచ్‌సికి రూ.1 లక్ష వస్తుందని డా.రాకేష్ వెల్లడించారు. ఈకార్యక్రమంలో డా.రాకేష్, రాజమండ్రి డా.నవీన, పిహెచ్‌సి



వైద్యులు డా.శ్రీదుర్గ, గా.లిఃత, సిహెచ్‌ఓ పద్మావతి, హెల్త్‌సూపర్‌వైజర్ సుధాకర్, యంపిహెచ్‌ఇఓ నాగవాసు, హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్, అప్పలరాజు, ఇంద్రజ, తమ్మారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



## వెంకన్న వైకుంఠద్వార దర్శనంలో రాష్ట్రప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని

**తిరుమల,జనవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** నూతన సంవత్సరంలో రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ శుభాలు కలగాలనిశ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుతెలిపారు .

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత కొమ్మినేని శ్రీనివాసరావు కుటుంబసమేతంగా తొలిసారిగా బుధవారం ఉదయం తిరుమలకుచేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో వెంకన్నను దర్శించుకుని అనంతరం వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

## పంట నష్టం వస్తుందని పురుగుల మందు తాగిన రైతు మృతి

**రాజవొమ్మంగి, జనవరి 4, ప్రభాతవార్త** పంటనష్టం వస్తుందని పురుగులు మందు త్రాగిన గిరిజన రైతు వైద్యసేవలు పొందుతూ మృతి చెందటం జరిగింది. రాజవొమ్మంగి ఎస్ఐ తొర్లపాటి గోపి నరేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం నాగేశ్వరరావు (48)సం. ఈఏడాది వరి, పొగాకు పంటలను వేసాడన్నారు. ఈపంటనష్టం వస్తుందని ఈనెల 2తేదీన ఉదయం ఆరు గంటలకు పొలం గడ్డి మందు త్రాగడంతో రాజవొమ్మంగి పిహెచ్‌సి కి తీసుకుని వచ్చారు. ప్రాథమిక చికిత్స చేసి రంపచోడవరం, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతూ 4తేదీ ఉదయం తొమ్మిది గంటలకు చనిపోవడంతో అక్కడ పోలీసులకు మృతుని భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన పిర్యాదుపై సెక్షన్ 174 క్రింద కేసు నమోదు చేసామన్నారు. మృతుని ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు.

## సంక్షేమంలో రాష్ట్రం మరింత ముందుకెళ్లేలా ఆశీస్సులు కోరా : మంత్రి కాకాణి

**తిరుమల,జనవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రంపై రాజకీయాలు గురించి వ్యాఖ్యలు చేయనని, రాజకీయ అంశాలు మాట్లాడనని రాష్ట్రమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయంగా వ్యాఖ్యలు చేయడానికి కొండ దిగిన తరువాతేనని చెబుతూ, ధనుర్మాసంలో ఎంతో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నానన్నారు. రాష్ట్రప్రజలకు నూతన సంవత్సరంలో అంతా శుభాలు కలగాలని, ఈ రాష్ట్రం సంక్షేమంలో మరింత ముందుకువెళ్ళాలని దేవుడ్ని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషంగా ఉండాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని, ఆ దిశగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని కాకాణి అన్నారు . ఇందుకు అవసరమైన శక్తిని, ఆశీస్సులను కలగజేయాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అంతకుముందు ఉదయం ఆలయంలోనికి చేరుకున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలు, నూతన సంవత్సరం క్యాలండర్, డైరీలు అందజేశారు.

## ఉయ్యూరు శ్రీనివాసరావు మంచి వ్యక్తి

### -రాజకీయ వేదికపైకి వచ్చారని ఉయ్యూరిని అల్లరి చేస్తున్నారు, వైకాంగ్రెస్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్




**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఉయ్యూరు శ్రీనివాసరావు మంచి వ్యక్తి, తన స్నేహితుడని, అతని ఎవ్వరికి అన్యాయం చేయాలనే ఆలోచన ఉండదని వైకాంగ్రెస్ పార్టీకి చెందిన ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. ఆయనే కాదు ఎన్నారైలను భయపెడితే ఎలా అని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు వలన రాష్ట్రంలో పేదలకు సేవలందించేందుకు ప్రవాస భారతీయులు ఎందుకు ముందుకు వస్తారన్నారు. ఉయ్యూరు శ్రీనివాసరావు ఇటీవల గుంటూరులో చీర పంపిణీ కార్యక్రమం తలపెట్టారు, చంద్రబాబు కార్యక్రమంలో అంతర్భాగంగా ఏర్పాటైన ఈ చీరపంపిణీ సందర్భంగా తొక్కిసలాట జరిగింది. ముగ్గురు మహిళలు మృతి చెందారు. ఈ ఘటనలో ఉయ్యూరు శ్రీనివాసరావుపై కేసు నమోదైంది. మొదట ఈ కార్యక్రమాన్ని మొదట తెలుగుదేశం కార్యక్రమంగా ప్రచారం చేసిన ఆ పార్టీ తరువాత ఎన్ఆర్ఐపై నెట్టిందని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు.
అధికార పార్టీ నేతలు తొక్కిసలాటలో ముగ్గురు మరణించడానిన్ర తీవ్రంగా ఆక్షేపించారు. ఈ కార్యక్రమానికి ముందు కందుకూరు ఘటనలో 8 మంది మరణించినా టీడీపీ గుంటూరు కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అధికార పార్టీ నేతలు ఖండించారు. ఈ నేపథ్యంలో గుంటూరు తొక్కిసలాటకు ఉయ్యూరు శ్రీనివాసరావును బాధ్యున్ని చేయడం సరికాదని మైలవరంలో అధికార పార్టీ ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రవాస భారతీయుడు, ఉయ్యూరు పౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ సమాజానికి సేవ చేయాలనే ఆసక్తితో ఉన్నారన్నారు.
చాలా కాలం నుంచి స్నేహితుడని తెలిపారు. గుంటూరులో రాజకీయ వేదికపైకి వచ్చారనే ఉద్దేశంతో కావాలని శ్రీనివాస్‌పై ఉన్నవి లేనివి కల్పించి చెప్పి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పేదల పట్ల అభిమానం ఉన్న శ్రీనివాస్ పెద్ద ఎత్తున కార్యక్రమం చేయబోయి అవస్థలు పాలయ్యారన్నారు. ప్రజలకు నష్టం కలిగించాలని కోరుకోరన్నారు.

## 6,7,8 తేదీలలో తాడేపల్లిగూడెంలో జాతీయ స్థాయి గేదెలు, ఆవుల అందాలు, పాల పోటీలు

### - దేశీయ గోజాతి సంవర్థక అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజు

**తాడేపల్లిగూడెం,జనవరి04,ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 6,7,8 తేదీలలో మూడు రోజులు పాటు జాతీయ స్థాయిలో గేదెలు, ఆవుల అందాలు, పాల పోటీలు జరగనున్నాయి. దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు) ఆధ్వర్యంలో ఈ పోటీలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వెళ్లే రహదారిలో పెదతాడేపల్లి గ్రామం పరిధిలో ఉన్న భారతీయ విద్యా భవన్స్ ప్రాంగణం ఈ పోటీలకు ముస్తాబవుతోంది. దీనికి సంబంధించి భారతీయ విద్యా భవన్స్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్, ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు వివరాలు వెల్లడించారు. 2010 నుంచి దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ తన కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలలో పర్యటించి గోజాతి, పశుజాతి మీద ఆసక్తి ఉన్న రైతులను కలిసి అన్ని రకాల బ్రీడ్ సేకరించి ఇక్కడ పెట్టడం జరిగిందని తెలిపారు. మేలు రకం జాతి సెమన్‌ను సేకరించి సెమన్ బ్యాంక్‌లో నిల్వ చేసి రైతులకు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.
గతంలో రాజమండ్రి, భీమవరంలలో రెండేసి సార్లు చొప్పున జాతీయ స్థాయిలో ఆవులు, గేదెలు అందాలు, పాల పోటీలు నిర్వహించామని, తాడేపల్లిగూడెంలో ఇది రెండోసారి అని రంగరాజు తెలియజేసారు.
ఈ విధంగా 6వ జాతీయ స్థాయి పోటీలను ఈ నెల 6,7.8 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. మోపురం ఉన్న జాతి ఆవులు, ముర్ర గేదెలకు పాల పోటీలు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీ శనివారం ఉదయం, సాయంత్రం, 8వ తేదీ ఆదివారం ఉదయం ఇలా మూడు పూటలు పాలు తీసి అత్యధికంగా పాలు ఇచ్చిన వాటిని మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందని రంగరాజు వివరించారు. ప్రథమ బహుమతిగా లక్ష రూపాయలు, రెండవ బహుమతిగా 75 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 50 వేల రూపాయల నగదు ను అందించడం జరుగుతుందని వెల్లడి ంచారు. ఒంగోలు ఆవు, అన్ని రకాల ఆవులు, గేదెలు ఇలా మూడు కేటగిరిలుగా పాల పోటీలు, బహుమతులు ఉంటాయన్నారు.
ఇక జాతుల ప్రదర్శనకు సంబంధించి ఆవులు, గేదెలను ఆ జాతి లక్షణాలను అతి సూక్ష్మంగా పరిశీలించి జాతుల వారీగా ఛాంపియన్, ఛాంపియన్ (రిజర్వు) లుగా ఎంపిక చేయడం జరుగు తుందన్నారు.
ఛాంపియన్ స్థానంలో ఉన్న వాటికి రూ.30 వేలు, ఛాంపియన్ (రిజర్వు) స్థానంలో ఉన్న వాటికి 20 వేల రూపాయలు మొత్తాన్ని నగదు బహుమతి ఇస్తారన్నారు.

## కొత్తూరులో విషాదం - క్వారీ చెరువులో జారి పడి ఇద్దరు చిన్నారులు మృతి

**తాడేపల్లిగూడెం,జనవరి04,ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు గ్రామంలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. చెరువులోకి స్నానానికి దిగిన చిన్నారుల్లో ఇద్దరు నీట మునిగి మృత్యు వాత పడ్డారు. మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం సూర్యారావుపేటకు చెందిన అబ్బసాని మల్లయ్య, వీరమ్మ, అబ్బసాని ముత్యాలు, వెంకమ్మలు సంచార జీవితం గడుపుతుంటారు. గ్రామాలు తిరుగుతూ మేకలు మేపుకుంటూ, యాచిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో వారు కొద్ది రోజులు క్రితం కొత్తూరు గ్రామానికి సంచారంలో భాగంగా వలస వచ్చారు. బుధవారం ఉదయం వీరు యధావిధిగా మేకలు మేపేందుకు వెళ్లారు. ఈ సమయంలో వారి పిల్లలు ఐదుగురు సమీపంలోని చెరువులోకి స్నానానికి దిగారు. కొత్తూరు సచివాలయానికి, స్కూలుకు సమీపంలోనే ఈ చెరువు ఉండడం గమనార్హం. అబ్బసాని కుమారి, జాన్, పండు, రాజు, సునీతలు స్నానానికి దిగగా జాన్ కాలు జారి లోతుకు వెళ్లిపోయాడు. ఆ బాలుడ్ని రక్షించేందుకు కుమారి ప్రయత్నించి ఆమె కూడా జారిపోయింది. మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడి కేకలు వేయడంతో చుట్టుప్రక్కల జనం వచ్చి చెరువులోకి జారిపోయిన వారిని ఇద్దరి కోసం గాలించారు. ఈ ప్రమాదంలో అబ్బసాని కుమారి (15), అబ్బసాని జాన్ (5) ప్రాణాలు కోల్పోయారు. రూరల్ సిఐ మూర్తి, ఎస్ఐ శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్పంచ్ హనుమంతు, సచివాలయ సిబ్బంది సహాయ చర్యలను పర్యవేక్షించారు.

